క్లుప్తంగా

రాష్ట్ర విద్య వైజ్ఞానిక ప్రదర్శనకు గౌతమ్



కోఆర్డినేటర్ సారథి నుంచి బహుమతి అందుకుంటున్న గౌతమ్

పుత్తూరు రూరల్: శ్రీకాళహస్తిలో సోమవారం జరిగిన తిరుపతి జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి గౌతమ్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు పుత్తూరు డీవైఈఓ రఘురామయ్య తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద ఎంపికైన 10 ప్రదర్శనల్లో పుత్తూరు పాఠశాల తరపున గౌతమ్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. గౌతమ్‌తో పాటు గైడ్ టీచర్ లతను స్థానిక ఎంఈఓ తిరుమలరాజు, పాఠశాల హెచ్ఎం ఆంజనేయులుశెట్టి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కం డ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన



విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై వివరిస్తున్న సీహెచ్ఓ జ్ఞానశేఖర్

పాలసముద్రం : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ పెడితే ఆరోగ్యం బాగుంటుందని సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి తెలిపారు. సోమవారం వారు పాలసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ వినాయకం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో సీహెచ్ఓ జ్ఞానశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు భోజనం చేయకముందు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకుని భోజనం చేయాలన్నారు. చేతిగోర్లు వారానికి ఒకసారి కట్ చేసుకోవాలని, దంతాలను శుభ్రం చేసుకోవడంపై వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం గంగాగౌరి, ఆశా కార్యకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించండి



అగరమంగళం పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రన్

గంగాధరనెల్లూరు: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని మండలవిద్యాశాఖాధికారి రాజేంద్రన్ కోరారు. మండలంలోని అక్కదేవతలకండిగ జెడ్పీ ఉన్నత పాఠశాల, అగరమంగళం యూపీ పాఠశాల, ఏ.వెంకటాపురం, నాగన్నకండిగ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఏపీఎం చిరంజీవి కూడా పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : బైక్ చోరీ కేసులో తిరుపతికి చెందిన కెట్టిపల్లి దిలీప్‌కు 63 రోజుల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. నిందితుడు దిలీప్ గత ఏడాది మరొకరితో కలిసి తిరుపతి ఈస్టు పోలీసు స్టేషన్ పరిధిలో బైక్ చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈస్టు పోలీసులు కేసు దర్యాప్తుచేసి నిందితుడు దిలీప్, పవన్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ దశలో పవన్‌కుమార్ మృతి చెందాడు. నిందితుడు దిలీప్ సోమవారం నేరం అంగీకరించడంతో శిక్ష విధించారు.

నవరత్నాల రూపశిల్పి సీఎం జగన్

- ప్రతి ఇంటికీ సంక్షేమం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: నవరత్నాల రూపశిల్పి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నబాపనపల్లి, చిన్నబాపనపల్లి దళితవాడ, నల్లపల్లి, వేణుగోపాలపురం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో దేశచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల అభివృద్ధికి కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని అన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమాలను అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా, కురాన్‌గా, బైబిల్‌గా భావించి ఇచ్చిన ప్రతి హామీని 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల గుమ్మం వద్దకే చేరుతున్నాయని తెలిపారు. జగనన్న ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ వల్లే సాధ్యమైందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమాలు ప్రపంచ చరిత్రలో నిలిచిపోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ వంటి పథకాలు ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు పరచడానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులు సుముఖత చూపుతున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధే, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగనన్నకు మీరంతా తోడుండాలన్నారు. అనంతరం చినబాపనపల్లి గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఉప ముఖ్యమంత్రి రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చినబాపనపల్లి దళితవాడలో డయాలసిస్‌తో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త నటరాజ్‌ను పరామర్శించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, డయాలసిస్ పింఛన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు జనార్దన్, మణి, చంద్రారెడ్డి, రాకేష్‌రెడ్డి, రామనాథరెడ్డి, డిసెంబర్‌శెట్టి, ప్రసాద్‌రెడ్డి, అశోక్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయులకు అండగా వైఎస్సార్‌సీపీ



సుభద్ర మృతదేహం నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి



కాటమరెడ్డికి నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం వేపగుంట పంచాయతీ వైస్ సర్పంచ్ శాంతకుమార్ తల్లి సుభద్ర, పుత్తూరు పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ అంకయ్య సోదరి పెద్దఅంకమ్మ, మున్సిపాలిటీ 1వ వార్డు మిట్టపల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటంరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమారస్వామిరెడ్డి వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, మీ కుటుంబాలకు పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, కోఆప్షన్ మెంబర్ చీరాల, సర్పంచ్ గిరిజాప్రసాద్, నాయకులు దిలీప్‌మొదలి, జనార్దన్‌యాదవ్, లక్ష్మణమూర్తి, జైకుమార్, రమేష్, యువరాజు, మోహన్‌గాంధీ, నరసింహులు, వెంకటముని, బాబు, రాంబాబు, మునస్వామి, చక్రి, మోహన్‌రెడ్డి, శివలింగం, సదర్శనం, ప్రభు, మణి, శీను తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆర్‌కే రోజా పర్యటన

నగరి : నియోజకవర్గంలో పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు నింద్ర మండలం జీఎస్ కండ్రిగ పంచాయతీ పరిధిలోని బీజీ కండ్రిగ, ఎంసీ కండ్రిగలకు తాగునీటి సరఫరాకు జీజీఎంపీ నిధులు అంచనా విలువ రూ.11 లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి పైపులైన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం నగరిలోని క్యాంప్ కార్యాలయంలో పుత్తూరు మండలానికి సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, వైస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.

ప్రముఖులకు ఆహ్వానం



ఎంపీ గురుమూర్తికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సోమవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలానికి ఆహ్వాన పత్రికలతోపాటు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, పార్టీ నాయకులు నరసింహులు, బాలాగౌడ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి



డీఎంపురంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ హేమలత

కార్వేటినగరం: సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి హేమలత అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని డీఎంపురం పంచాయతీలో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటలను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు పన్నుస్వామి సేంద్రియ నూనె మందులను వారంలో ఒక్కసారి మాత్రమే పంటకు పిచికారీ చేస్తున్నారని తెలిపారు. అలాగే సాళ్ల మధ్య దూరం 4 అడుగులు, మొక్కల మధ్య దూరం 2 అడుగులు వదిలిపాలంలో ఎటువంటి కలుపు లేకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారని చెప్పారు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకపోవడంతో పంట మంచి దిగుబడి వస్తోందన్నారు. రైతులు వేలకు వేలు పెట్టుబడులు పెట్టి రసాయన ఎరువుల వాడడం వల్ల పంట ఆరోగ్యకరంగా లేకుండా దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే అవకాశం ఉందని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే మిరప సాగులో అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. డీఎంపురంలో పొన్నుస్వామి, రవిశేఖర్ రైతులు పాటిస్తున్న సూచనలు, సలహాలను ప్రతిరైతు పాటిస్తే కాయలు కూడా ఆరోగ్యంగా గట్టిగా మంచి రంగుతో కూడిన దిగుబడి సాధించవచ్చన్నారు.

నేడు వాహనాల వేలం

వడమాలపేట : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు వడమాలపేట పోలీస్‌స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో 9 గంటలకు హాజరై నిర్దేశించిన డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, వాహనాలను ముందుగా చూసుకునే వెసులుబాటు ఉందన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు డిపాజిట్ పోగా, మిగతా నగదును ప్రభుత్వం నిర్దేశించిన జీఎస్టీ రూపంలో చెల్లించాలని సూచించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఆస్పత్రిలో వసతులను పరిశీలిస్తున్న ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, అధికారులు

వెదురుకుప్పం: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌డీఎఫ్‌సీ సమావేశం జరిగింది. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, అభివృద్ధి అంశాలపై చర్చించారు. వసతుల కల్పన, సిబ్బంది కొరత, ఇతరత్రా సమస్యల పరిష్కారంపై తీసుకోవాల్సిన అంశాలకు సంబంధించి నివేదిక తయారు చేశారు. అనంతరం వారు ఆస్పత్రిలో పరిసరాలను పరిశీలించారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఆరోగ్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ప్రభుత్వ ఆశయాలు నెరవేరవన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకుని రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో సిబ్బంది కొరత, వసతుల కల్పనపై ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లి జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎంపీడీఓ సుధాకరరావు మాట్లాడుతూ గతంలో రాష్ట్రస్థాయిలో ఆస్పత్రికి అవార్డు వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లినప్పుడు, లేదా ఆస్పత్రిలో గానీ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భువనేశ్వరి, వైద్యాధికారులు ప్రవీణ, సురేఖ, సీహెచ్ఓ వెంకటరమణయ్య, ఆరోగ్యసిబ్బంది, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, బొజ్జారెడ్డి, గణపతిరెడ్డి, సుమతి, విజయ పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగికి రిమాండ్

తిరుపతి లీగల్ : గత నెల 26న అమ్మవారి ఊరేగింపులో విధి నిర్వహణలోని పోలీసు కానిస్టేబుల్ శేషాద్రిపై దాడి చేసిన కేసులో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆర్జితం ఇన్‌స్పెక్టర్ దామోదరానికి 20 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత సోమవారం ఆదేశాలు జారీ చేశారు. బాధితుడు శేషాద్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

59 మందికి జరిమానా

తిరుపతిలో మద్యంతాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 59 మందికి రూ.79,640 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి తీర్పు చెప్పారు. నిందితులను ట్రాఫిక్, ఎస్వీయూ, ఈస్టు పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

అడవుల సంరక్షణ మన బాధ్యత



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

శ్రీరంగరాజపురం: అడవులకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అటవీశాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం ఎస్సార్‌పురం ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ అడవుల సంరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. అటవీశాఖ నిబంధనలను ఉల్లంఘించి అడవులకు నిప్పు పెట్టడం, చెట్లు నరకడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం పర్యావరణం కాపాడుకోవడం ఎలా అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు అటవీశాఖ వలంటీర్లు బ్యాడ్జీలను అందించారు.

ముగిసిన యువ ధార్మికోత్సవం

తిరుమల: ఆస్థాన మండపంలో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన యువ ధార్మికోత్సవం సోమవారం ముగిసింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రాఘవేంద్రాచార్యులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆధ్యాత్మికత, దైవ భక్తి కలిగి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. దాసహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు, ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక నుంచి వచ్చిన 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికత వైపు మొగ్గు చూపాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

– సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు

నగరి : రైతులు నూతన సాంకేతికత వైపు మొగ్గు చూపాలని తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని వేలావడి గ్రామంలో డ్రోన్లు ఉపయోగించి పంటలకు పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, న్యూఢిల్లీ వారు వ్యవసాయ డ్రోన్ల వినియోగాన్ని రైతులకు చేరవేయడానికి రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేయడం జరిగిందని, ఈ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల్లో రైతుల పొలాల్లో డ్రోన్ వినియోగించి ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రోన్ వినియోగించి పిచికారీ చేయడంలో 6 నుంచి 8 నిమిషాల వ్యవధిలో కేవలం 10 లీటర్ల నీటిని వినియోగించి మందు మోతాదులో 70 నుంచి 80 శాతం వాడి పిచికారీ చేయవచ్చన్నారు. అలా చేయటం వల్లనీరు, పురుగుమందు, కూలీల ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. మామూలుగా కంటే కూడా ఈ పద్ధతిలో పురుగుమందు ప్రభావం బాగా పని చేస్తుందని, ఈ నూతన సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం వారు గ్రామంలో 10 ఎకరాల పొద్దుతిరుగుడు పంటలకు డ్రోన్ వినియోగించి పురుగుమందు పిచికారీపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు దివ్య, రామ్‌కుమార్, మండల వ్యసాయాధికారులు రాఘవేంద్ర యాదవ్, యామిని, వ్యవసాయ సహాయకులు ప్రేమ్ కుమార్, శోభ, రైతులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పంట పొలాల్లో డ్రోన్ల ద్వారా పురుగు మందులను పిచికారీ చేయడం ద్వారా రైతులు చాలా రకాలుగా లాభాలు పొందవచ్చని తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. పుత్తూరు రూరల్ మండలం తొరూరు గ్రామంలో సోమవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డ్రోన్ల ద్వారా పిచికారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర వ్యవసాయ పరిశోధనా మండలి డ్రోన్ల వినియోగాన్ని రైతులకు అందించడానికి రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలోని 10 ఎకరాల మామిడి, పొద్దు తిరుగుడు పంటల్లో డ్రోన్ ద్వారా పిచికారీ విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య, రామ్‌కుమార్, వ్యవసాయ సహాయకుడు మురళి, రైతులు పాల్గొన్నారు.



డ్రోన్ సహాయంతో పంటకు మందులు పిచికారీచేస్తున్న శాస్త్రవేత్తలు

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : ప్రభుత్వం మంజూరు చేసిన గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. సోమవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలసి ఆమె తిరుమలరాజుపురం, గంగమాంబపురం, నరసింహాపురం పంచాయతీల్లోని జగనన్న లేఅవుట్‌లలో గృహనిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్లను మంజూరు చేసిందని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తోందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు పూర్తి చేయించాలని సూచించారు. ముఖ్యంగా జగనన్న లేఅవుట్‌లో తాగునీరు, రోడ్డు, విద్యుత్ కొరతలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు హరి, సుధాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల సభ్యులతో సమీక్ష



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను సక్రమంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులకు, వీఓ లీడర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్‌ను వందశాతం పూర్తి చేయాలని తెలిపారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. బ్యాంకు లింకేజీ రుణాలను సక్రమంగా కంతుల ప్రకారం కట్టించాల్సిన బాధ్యత సంబంధిత లీడర్లపై ఉందన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, వనజ, సంఘమిత్రలు మురగయ్య, మంజుల, శోభ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని బంగారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ×భ్రూణహత్యలు వద్దు–లింగవివక్ష నిర్మూలన¶పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని సూచించారు. అలా చేస్తే ప్రభుత్వం రూ.10 వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధిస్తుందన్నారు. ఆడబిడ్డను బతకనిద్దాం–ఎదగనిద్దాం, నేటి ఆడపిల్ల రేపటి అమ్మ అవుతుందన్నారు. అనంతరం కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఏఎస్ఎం దేవి, సంఘమిత్ర వనిత, అంగన్‌వాడీ కార్యకర్త జమున పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

వైభవం.. దోపోత్సవం

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తిప్రపత్తులతో దోపోత్సవం నిర్వహించారు. మొదల ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. –శ్రీకాళహస్తి